# ఆరోగ్యమే మహాభాగ్యం

- తమిరిశ జానకి



గిరి వాళ్ల ఇల్లు ఒక చిన్న పెంకుటిల్లు. అదే వీధిలో రాజా వాళ్ల ఇల్లు పెద్ద అందమైన గులాబీ రంగు మేడ. ఆ మేడని చూస్తూ ఎంత పెద్ద ఇల్లో... ఎంత బాగుందో అనుకుంటూ ఉంటాడెప్పుడూ గిరి.

"తమ్ముడూ! అన్నం తినడానికి రమ్మంటోంది అమ్మ" అక్క పిలుపుతో వచ్చి కూర్చున్నాడు.

"ఏంటమ్మా? రోజూ ఏదో ఓ ఆకుకూర ఎందుకమ్మా వండుతావు? ఈ గడ్డి తినడం ఎందుకు చెప్పు? ఆ రాజా చూడు చక్కగా రోజూ రకరకాల చిప్స్ ప్యాకెట్లు... ఇంతింత పెద్దసైజు చాక్లెట్లు కొనుక్కుని తింటూ ఉంటాడు. అన్నమసలు సరిగ్గా ఏ రోజూ తినడు."

"అన్నం తినడం మానేసి అలాంటివే తింటూ కూచుంటానంటే ఆరోగ్యానికి మంచిది కాదురా" చెప్పింది సుగుణమ్మ.

"పోమ్మా! నువ్వెప్పుడూ అలాగే అంటావు."

"ఆ రాజా వాళ్లకి చాలా డబ్బుంది తమ్ముడూ. అందుకే రోజూ అలాంటివన్నీ కొనుక్కుంటాడు."

అక్క మాటలు నిజం అనిపించాయి గిరికి.

"కాదు తల్లీ! డబ్బున్నంత మాత్రాన ఇంట్లో అన్నం తినడం మానేసి అలాంటివి కొనుక్కుని తిని అనారోగ్యాలు తెచ్చుకోమని ఎవరూ చెప్పరు తల్లీ!" కూతురి భుజమ్మీద చెయ్యి వేసి దగ్గరికి తీసుకుంది సుగుణమ్మ.

"అయినా... మనం భాగ్యవంతులం కాదని మీరెందుకు అనుకుంటున్నారు?" తల్లి వేసిన ప్రశ్న పిల్లలిద్దర్నీ ఆశ్చర్యంలో పడేసింది.

"మనం భాగ్యవంతులం అయితే ఇంత చిన్న ఇంట్లో ఎందుకున్నాం?" వెంటనే అడిగేశాడు గిరి.

"ఇల్లు చిన్నదా, పెద్దదా అనే దాన్ని బట్టి కాదు నిర్ణయించాల్సింది."

"మరి దేన్ని బట్టి?"

"మనం ఆరోగ్యంగా... ఆనందంగా ఉన్నామా, లేదా అనే దాన్ని బట్టి చెప్పాలి. వారానికి రెండు రోజులు అనారోగ్యంతో స్కూల్ మానేస్తూనే

ఉంటాడటగా ఆ రాజా?"

"ఔనమ్మా! ఎప్పుడూ ఏదో ఓ కారణంతో డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తూనే ఉంటారు పాపం వాడిని. అస్తమానం డాక్టర్లకి, మందులకి చాలా డబ్బు ఖర్చవుతోందని వాళ్లమ్మ అనడం నేను విన్నాను"- కూతురు కళ్లు తిప్పుతూ ఆరిందాలా మాట్లాడితే నవ్వొచ్చింది సుగుణమ్మకి.

"మీ ఇద్దరికీ తెలియని విషయం ఇంకొకటి ఉంది."

"ఏంటదీ?" ఇద్దరూ ఒకేసారి అడిగారు ఆతృతగా.

"ఆ రాజా వాళ్లిల్లు అమ్మకానికి పెట్టారుట."

"అంటే?"

"అంటే... వాళ్లిల్లు అమ్మేసి ఇంకో చిన్న ఇల్లు అద్దెకి తీసుకుని అందులోకి మారిపోతారుట"

"ఎందుకూ?"

"రాజా వాళ్ల నాన్నకి ఒంట్లో బాగులేదుట. ఏదో పెద్ద వైద్యమే చేయించాలిట. దానికి లక్షలు లక్షలు ఖర్చవుతుందిట. అందుకోసం ఇల్లు అమ్మేస్తారుట."

"అయ్యో! పాపం కదమ్మా..."

"ఔను తల్లీ... అందుకే... మన పెద్దవాళ్లు ఆరోగ్యమే మహాభాగ్యం అన్నమాట అక్షరాలా నిజం అనిపిస్తుంది నాకు. ఆరోగ్యంగా వుంటే బుర్రకి పని చెప్పిగానీ... శారీరక శ్రమతో గానీ డబ్బు సంపాదించుకోగలడు మనిషి... ఆనందంగా ఉండగలడు... అప్పుడది మహాభాగ్యమే కదా? మన దగ్గర ఎన్ని లక్షలున్నాయన్నది కాదు ప్రశ్న. మనం ఎంత ఆనందంగా జీవితాన్ని గడుపుతున్నాం అన్నది ముఖ్యం. ఔనా కాదా?"

"నువ్వు చెప్పింది నిజమేనమ్మా... మనం భాగ్యవంతులమే." అమ్మ మాట చక్కగా అర్థం చేసుకోగలిగారు పిల్లలిద్దరూ. ఆ ఇంట్లో చిరునవ్వుల జల్లు కురిసింది.

## అపూర్వ సమ్మేళనమ్

**1938** ఏప్రిల్ 15న బెజవాడలో అయ్యదేవర కాళేశ్వరరావు పంతులు గారింట్లో వివాహం. మద్రాసు గవర్నమెంట్ ఓరియంటల్ లైబ్రరీ అధికారిగా వున్న వేటూరి ప్రభాకరశాస్త్రి గారి కూతురు లలితను, రాజమండ్రి టీచర్స్ కాలేజీ ప్రిన్సిపాల్ విస్సా అప్పారావు పంతులు గారి జ్యేష్ఠ పుత్రుడు రామచంద్రరావుకు ఇచ్చి వివాహం చేశారు. వేటూరి వారు వెలనాటి బ్రాహ్మణుడు. విస్సా వారు ఆరువేల నియోగులు. నియోగి, వైదికుల ఈ అపూర్వ సమ్మేళనం ఇద్దరి మధ్యా కక్షలు తగ్గటానికి ఆదర్శమని కృష్ణాపత్రికలో ఒక ప్రకటన వెలువడింది.

## అద్భుత శతావధానం

**పి**ఠాపురం రాజా వేంకట సూర్యారాయ మహీపతి ఆదేశం మేరకు వేంకట రామకృష్ణ కవులు 13.9.1909న మధ్యాహ్నం 3.45 నుండి 7.50 గంటల వరకు శతావధానం చేశారు. రాజావారు అద్భుత శతావధానంగా కీర్తించి సత్కరించారు. ఒకసారి వీరు ప్రహ్లాద చరిత్ర కావ్యాన్ని నూరు పద్యాలలో ఆశువుగా ఒకే గంటలో చెప్పారట.

## ఇలా వాడుక ఎక్కువ...

**నీ** బండ పడ - పర్వత ప్రాంతంలో
నీ పుట్టి మునగ - వాగులున్న ప్రాంతంలో
నీ దుంప తెగ - అడవి, మెరక ప్రాంతాలలో
నీ తాడు తెగ - తెరచాప త్రాడు, పడవ త్రాడు, నదీ ప్రాంతంలో